క్లుప్తంగా

కొత్త పింఛన్లు మంజూరు చేయండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు

యాడికి: ప్రభుత్వం ఏర్పడి 10 నెలలైనా అర్హులకు కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదని, దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే పింఛన్ మంజూరు చేయాలని సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వీరరాజుకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పలు గ్రామాల్లో 60 సంవత్సరాలు దాటిన వృద్ధులు, భర్త చనిపోయిన మహిళలు, దివ్యాంగులు చాలామంది ఉన్నారని, వారి దరఖాస్తులను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయాలని సంజీవరాయుడు కోరారు.

గేట్స్‌లో పాలిసెట్ ఉచిత కోచింగ్ ప్రారంభం



ఉచిత కోచింగ్ ప్రారంభమైన దృశ్యం

గుత్తి: పట్టణంలోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం పాలి సెట్ ఉచిత కోచింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, కరస్పాండెంట్ పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ నరసింహులు మాట్లాడుతూ అవకాశాన్ని పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుత్తి నుంచి కాలేజీ వరకూ ఉచితంగా బస్సు సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు కాలేజీలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

మే 19న కల్యాణోత్సవం



కరపత్రాలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

తాడిపత్రి రూరల్ : పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయంలో మే19న భద్రావతి, భవనా రుషీశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. మే 17 నుంచి 21 వరకూ కల్యాణ మహోత్సవం, తిరునాల, ఊరేగింపు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను దేవాలయంలో వారు విడుదల చేశారు.

విద్యార్థినికి సత్కారం



సబిహాసుల్తానాను సత్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: బీటెక్ (ఈఈఈ) కోర్సులో ప్రతిభ కనబరిచి బంగారు పతకానికి అర్హత సాధించిన గుంతకల్లు మోదినాబాద్‌కు చెందిన సబిహా సుల్తానాను అభయ విద్యానిధి సంస్థ ఘనంగా సత్కరించింది. సోమవారం స్థానిక ఆర్.టీ.స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభయ విద్యానిధి వ్యవస్థాపక చైర్మన్ వసుంధర దేవి, అధ్యక్షురాలు డి.మాధవీలత మాట్లాడారు. నిరుపేద ట్యాంకర్ డ్రైవర్ ఖాసీమ్, రజియా దంపతుల కుమార్తె సబిహా సుల్తానా బీటెక్ కోర్సు పూర్తి చేయడానికి సంస్థ తరఫున సహకరించామన్నారు. గుత్తి గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో (2020-2024)లో బీటెక్ ఈఈఈ బ్రాంచ్‌లో 87 శాతంతో ప్రతిభ కనబరిచి జేఎన్‌టీయూ తరఫున గోల్డ్‌మెడల్‌కు అర్హత సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అభయ విద్యానిధి సంస్థ కార్యదర్శి వరలక్ష్మి, కోశాధికారి అనురాధ, సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



అవగాహన కల్పిస్తున్న ఏఓ సోమశేఖర్

గార్లదిన్నె: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ సోమశేఖర్ సూచించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై మండల స్థాయి అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ మండలంలో కోటంక, మర్తాడు గ్రామాల్లోని రైతులతో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగు చేయించామన్నారు. ప్రస్తుతం గార్లదిన్నె, కమలాపురం గ్రామాలను ఎంపిక చేశామన్నారు. వెలుగు ఏపీఎం మల్లికార్జున, సీసీ రామాంజనేయులు,ఐసీఆర్పీ వెంకటరామిరెడ్డి, ఎమ్‌సీఏ నందిని తదితరులు పాల్గొన్నారు.

వీడని ప్లాస్టిక్ భూతం!

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం
- పట్టించుకోని అధికారులు



గుంతకల్లు పట్టణంలోని గుంత బావి రైల్వే బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

గుంతకల్లు టౌన్: ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి ప్రతిబంధకంగా మారాయి. విచ్చలవిడిగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లు మానవాళి మనుగడను ప్రశ్నిస్తున్నాయి. ప్రజల ప్రాణాలకు హానికరమైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని గుంతకల్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో పలుమార్లు తీర్మానాలు చేసినా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకం మాత్రం విచ్చలవిడిగానే కొనసాగుతోంది. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ రోజు మాత్రమే స్వచ్ఛభారత్..ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్న అధికారులు, యంత్రాంగం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడానికి అవసరమైన కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం లేదు. డ్వాక్రా మహిళల ద్వారా వస్త్ర సంచుల తయారీ చేయించి వాటిని మెప్మా మార్ట్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తెచ్చి ఓ వైపు ప్లాస్టిక్ నిషేధంతో పాటు మరో వైపు డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో గతంలో తీసుకున్న నిర్ణయాలను మున్సిపల్ యంత్రాంగం నేటికీ అమలు చేయడం లేదు.

రోజూ టన్ను ప్లాస్టిక్ వ్యర్థాలు..

లక్షన్నర జనాభా కలిగిన గుంతకల్లు మున్సిపాలిటీలో 37 వార్డులున్నాయి. పట్టణంలో రోజూ 67 టన్నుల వరకూ చెత్తాచెదారంతో కూడిన వ్యర్థాలు ఉత్పత్తవుతున్నాయి. ఇందులో ఒక టన్ను పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండటం గమనార్హం. పారిశుధ్య కార్మికులు రోజూ ఈ వ్యర్థాలను తొలగిస్తున్నారు. అయినా కొన్ని ప్రాంతాల్లో వ్యర్థాలు కనిపిస్తూనే ఉన్నాయి. దుకాణాల్లోని వ్యర్థాలను రోడ్లు, మురుగు కాలువల్లో వేస్తుండడంతో మురుగు ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో అపరిశుభ్రత వాతావరణం నెలకొంటోంది.

ఆకస్మిక తనిఖీలు..జరిమానాలేవీ?

పట్టణంలోని ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు గతంలో మున్సిపల్ కమిషనర్, శానిటేషన్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించేవారు. ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న, వినియోగిస్తున్న దుకాణదారులకు జరిమానాలు విధించేవారు. దీంతో గతంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం కొంత తగ్గింది. కానీ ప్రస్తుత కమిషనర్ పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ఫోటోలను షేర్ చేస్తున్నారే తప్ప ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి సారించడం లేదన్నది పర్యావరణ హితులు విమర్శిస్తున్నారు

వస్త్ర సంచుల వినియోగమేదీ?

పాలిథిన్ కవర్ల స్థానంలో వస్త్ర సంచులను డ్వాక్రా మహిళల ద్వారా తయారు చేయించి వాటిని మున్సిపల్ మెప్మా మార్ట్ ద్వారా ప్రజలకు, హోల్‌సేల్ వ్యాపారస్థులకు విక్రయించాలని గత ప్రభుత్వ హయాంలో అధికారులు నిర్ణయించారు. తద్వార ప్లాస్టిక్ నిషేధంతో పాటు డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి పాటుపడాలని సంకల్పించారు. కానీ ప్రస్తుతం కొనసాగుతున్న ఆ దిశగా దృష్టి సారించడం లేదు.

చర్యలు తీసుకుంటాం



సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని పట్టణంలోని వర్తక, వ్యాపార సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి చెప్పాం. అయినా ప్లాస్టిక్ వినియోగం జరుగుతూనే ఉంది. ఇకపై ప్లాస్టిక్ విక్రేతదారులు, దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు విక్రేతలకు జరిమానాలు విధించి తగు చర్యలు చేపడుతాం. ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలి.

– హరినాథ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుంతకల్లు

కరువు మండలంగా ప్రకటించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు

పుట్లూరు: పుట్లూరును కరువు మండలంగా ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ శేషారెడ్డిని కలసి కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ బి.రాఘవరెడ్డి, ఎంపీటీసీ బి.నాగార్జునరెడ్డి మాట్లాడుతూ తాగునీటి కోసం పదుల కిలోమీటర్లు వెళ్లి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీరు అందించే పరిస్థితి మండలంలో ఉందన్నారు. రైతుల చీనీ తోటలు, ఇతర పంటలకు ట్యాంకర్ల ద్వారా నీరు ఇతర ప్రాంతాల నుంచి తరలించి కాపాడుకుంటున్నారన్నారు. వందల అడుగులు వేసినా బోరుబావుల్లో చుక్క నీరు దొరకని పుట్లూరును కరువు మండలంగా ప్రకటించకుండా విస్మరించడం సమంజసం కాదన్నారు. గత ఏడాది రబీలో పప్పుశనగ సాగు చేసిన రైతులు ఎకరాకు రెండు క్వింటాళ్ల లోపు దిగుబడి వచ్చి తీవ్రంగా నష్టపోయారని వివరించారు. ప్రభుత్వం స్పందించి అత్యంత కరువు ప్రాంతమైన పుట్లూరును కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగేశ్వరావు, సర్పంచ్‌లు మహేశ్వరరెడ్డి, ఓబులేశు, రవి చంద్రారెడ్డి, ఎంపీటీసీ ఆదినారాయణ, నాయకులు శివారెడ్డి, నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, జయరామిరెడ్డి, రమణారెడ్డి, తిమ్మాపురం రాఘవరెడ్డి, విష్ణునారాయణ, హరి, వెంకటేశ్వర రెడ్డి, శేషు, శ్రీరామిరెడ్డి, శివారెడ్డి, రామిరెడ్డి, మల్లికార్జున, సుబ్బు, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న మైనార్టీ నాయకుడు ఫయాజ్‌బాషా

తాడిపత్రి రూరల్: వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని మైనార్టీ నాయకుడు ఫయాజ్‌బాష డిమాండ్ చేశారు. పట్టణంలోని సిద్దిబాషా దర్గా సమీపంలో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ప్రకటించడం శోచనీయమన్నారు. బిల్లును ఉపసంహరించుకునేంత వరకూ ముస్లింలు వివిధ మార్గాల ద్వారా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. రాజ్యాంగంలోని 14వ ఆర్టికల్‌లో పేర్కొన్న విధంగా అందరూ సమానం అన్న భావనకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. పూర్వం ముస్లింలకు దానంగా ఇచ్చిన భూములను వక్ఫ్ బిల్లు సవరణతో ఇష్టానుసారంగా వ్యవహరించడం ఎంతవరకూ సమంజసమని ఆయన ప్రశ్నించారు. దీక్షల్లో ముస్లిం పెద్దలు హయాజ్‌బాష, అరిఫ్, అన్వర్, మహబూబ్‌బాష, అబ్దుల్లా, జిలాన్, వలి, సలాం, అయూబ్ తదితరులు ప్రసంగించారు.

ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి మద్దతు

తాడిపత్రిటౌన్: వక్ఫ్‌బోర్డ్ సవరణ బిల్లు వ్యతిరేకించడం ద్వారా ముస్లింలకు మేలు జరుగుతుందంటే మీకే మద్దతు ఇస్తానని టీడీపీ ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వ స్టాండ్‌కు ఆయన వ్యతిరేకంగా మాట్లాడటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సోమవారం తాడిపత్రి పట్టణంలోని సిద్దిబాషా దర్గా వద్ద వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు నిరాహార దీక్ష చేపట్టారు. వారి దీక్షకు తాడిపత్రి టీడీపీ ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి మద్దతివ్వడం సర్వత్రా విమర్శలకు దారి తీసింది. వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ పూర్తి మద్దతిస్తుంటే...ఆ పార్టీ ఎమ్మెల్యే వ్యతిరేకించే ధోరణిలో వ్యవహరించడం తీవ్ర విమర్శలు వినివిస్తున్నాయి.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

శింగనమల: కూటమి పార్టీలు గత ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి , అధికారంలోకి వచ్చిన తరువాత హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నాయని, వెంటనే సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు తరిమెల రామాంజినేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చి, వాటిని అమలు చేయకుండా సీఎం చంద్రబాబు సాకులు చెబుతున్నారని, వెంటనే హామీలను అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ బిల్లులు 10 వారాల నుంచి కూలీలకు విడుదల చేయలేదని, కూలీలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని చెప్పి నేటికీ అందించలేదన్నారు. అకాల వర్షాల నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లోని ప్రతి నిరుపేదకూ మూడు సెంట్లు స్థలమిచ్చి, గృహాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, రవి, సూరి, శ్రీరాములు, లక్ష్మీరంగయ్య, దైవదత్తం తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో



ప్రాజెక్ట్‌ను వివరిస్తున్న విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రతినిధులు ఐఈఐ స్టూడెంట్ చాప్టర్‌తో కలసి నాల్గవ సంవత్సరం ఈఈఈ, మెకానికల్ విద్యార్థుల కోసం ప్రాజెక్ట్ ఎక్స్‌పో-2కే25ను నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో నిర్వహించే ప్రాజెక్ట్ ఎక్స్‌పో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల విద్యుత్ వ్యవస్థలు, పునరుత్పాదక శక్తి ఆటోమేషన్, ఎంబెడెడ్ సిస్టం ఐఓటీ, రోబోటిక్స్ వంటి రంగాలను కవర్ చేసే విస్తృత శ్రేణి ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్ ఆఫ్ ఐక్యూఏసీ డాక్టర్ సాయి చైతన్య కిషోర్ ఆర్అండ్‌డి కన్వీనర్ డాక్టర్ రఘుబాబు, ఈఈఈ విభాగం అధిపతి డాక్టర్ మేరీమాత, మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ వంశీక్రిష్ణారెడ్డి, ప్రోగ్రాం సమన్వయ కర్త అరవింద్‌బాబు, శ్రావణి, కిరణ్మయి, బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కూటమి విఫలం



మాట్లాడుతున్న కుళ్లాయిస్వామి

గుంతకల్లు: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంతో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి విమర్శించారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు విద్యారంగానికి పెద్దపీట వేస్తామని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు భరోసా కల్పిస్తామని చంద్రబాబు, లోకేష్ హామీలిచ్చి, అధికారం చేపట్టాక విస్మరించారని మండిపడ్డారు. ప్రతి విద్యార్థికీ రూ.15వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం వచ్చే విద్యాసంవత్సరం ఇస్తామనడం ఎంతవరకు సమజసమని ప్రశ్నించారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 77ను రద్దు చేస్తామని, తొమ్మిది నెలలు గడుస్తున్న ఆచరణకు నోచుకోలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.3,850 కోట్లు విడుదల చేయాల్సి ఉంటే కేవలం రూ.788 కోట్లు మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకున్నారన్నారు. దీంతో ఫీజుల చెల్లించలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వినోద్‌కుమార్, వెంకట్‌నాయక్, కోశాధికారి అఖిల్, నాయకులు రోహిత్, శివమణి, ఫర్హాన్, రాజేష్, మధు, జయరామ్, ధనుంజయ, ముస్తఫా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

శింగనమల: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ విజయకుమార్ సూచించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన రికార్డులుండాలన్నారు. కారు డ్రైవింగ్ చేసే వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రెండిళ్లపై రాళ్లతో దాడి

గుత్తి: పట్టణంలోని ఆచార్యుల కాలనీలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో వేణుగోపాలాచారి కుటుంబ సభ్యులు శంకర్ ఆచారి, మాణిక్యం ఆచారి ఇళ్లపై రాళ్లతో దాడి చేశారు. వేణుగోపాలాచారి కుమారుడు వీరాచారి మృతికి శంకర్ ఆచారి, మాణిక్యం ఆచారి కుటుంబాలే కారణమే నెపంతో ఈ దాడి జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దాడి ఘటన సమాచారం తెలిసిన వెంటనే హెడ్ కానిస్టేబుల్ హనుమంతు, భాస్కర్ నాయుడు తదితరులు ఆచార్యుల కాలనీకి వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సంక్షిప్త సమాచారం

వైభవంగా జ్యోతుల ఉత్సవం

పుట్లూరు: మండలంలోని సూరేపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో సోమవారం చౌడేశ్వరీ జ్యోతుల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి నుంచి జ్యోతుల ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. వేడుకలను తిలకించడానికి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. పోలీసులు ఆయా గ్రామాల్లో బందోబస్తు నిర్వహించారు.

'పైప్‌లైన్ ఏర్పాటుకు సహకరించండి'

గుంతకల్లుటౌన్: పట్టణంలోని గుంతబావి వీధి నుంచి పోలీస్ క్వార్టర్స్ వరకూ మెయిన్ పంపింగ్ పైప్‌లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నందువల్ల ట్రాఫిక్‌కు కొంత అంతరాయం కలుగుతుందని, పుర ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పైప్‌లైన్ పనులు పూర్తయ్యే వరకూ ట్రాఫిక్‌ను మళ్లించడానికి పోలీసులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారన్నారు. అంతరాయానికి చింతిస్తున్నామని, ప్రజలు సహకరించాలన్నారు.

ఇంటి పన్నుపై 5 శాతం రాయితీ

తాడిపత్రి రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి రాయితీ పొందాలని శివరామకృష్ణ తెలిపారు.. ఈ నెల 30లోగా పెండింగ్ ఉన్న ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందాలన్నారు. అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అనాథాశ్రమాలకు సరుకుల పంపిణీ

తాడిపత్రి: మండలంలోని రమణమహర్షి ఆశ్రమం, పట్టణంలోని సౌభాగ్య సింధు ఆశ్రమాలకు ఇన్ఫినిటీ ఫిన్ కార్ప్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ. లక్ష విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేసినట్లు మేనేజర్ కృష్ణ మామిల్ల సోమవారం తెలిపారు. కంపెనీ ఉద్యోగులు భాస్కర్, ఈశ్వర్‌రెడ్డి, బాబా ఫకృద్దీన్, హాజీవలి, కిరణ్, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గుత్తి: గుత్తి పట్టణంతోపాటు మండలంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్ పీడీసీఎల్ డీఈ పిశ్‌లై తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పులిగుట్ట విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటనెన్స్ పనులు ఉన్న నేపథ్యంలో కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జగన్ పర్యటన విజయవంతం చేయండి

గుంతకల్లుటౌన్: రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో ఇటీవల దారుణహత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు మంగళవారం వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి విచ్చేయనున్నట్లు గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉదయం 9.30 గంటలకు పాపిరెడ్డిపల్లికి చేరుకుని, జగన్ పర్యటన విజయవంతం చేయాలని సోమవారం ఆయన ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఫ్యాక్షన్ కొనసాగిస్తే కఠిన చర్యలు

యల్లనూరు: ఫ్యాక్షన్ కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి హెచ్చరించారు. సోమవారం మండలంలోని యల్లనూరు, జంగంపల్లి, వెన్నపూసపల్లి, నిట్టూరు, మేడికుర్తి తదితర గ్రామాల్లో ఎస్‌ఐ పర్యటించారు. ఫ్యాక్షన్ ప్రోత్సహించినా, గొడవలను ప్రేరేపించినా ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

108 కలశాలతో ఊరేగింపు



కలశాలను ఊరేగిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మండలంలోని చీమలవాగుపల్లిలో సోమవారం సాయంత్రం 108 ఏకాదశులు పూర్తయిన సందర్భంగా గ్రామస్తులు 108 కలశాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి నెలా ఏకాదశి రోజు భజన కీర్తనలు చేసి స్వాముల దర్శనార్థం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేయడం గత 108 నెలలుగా ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు రాతి దూలం లాగుడు పోటీలు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని హరిజనవాడలో మంగళవారం రాష్ట్ర స్థాయి రాతి దూలం పోటీలను ఏర్పాటు చేశామని నిర్వాహకులు సోమవారం తెలిపారు. శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని నిర్వహించే పోటీల్లో విజేత వృషభాల యజమానులకు బహుమతులందజేస్తామన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవంపై ర్యాలీ

గార్లదిన్నె/బుక్కరాయసముద్రం: గార్లదిన్నెలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తారణాధికారి నాగేశ్వరయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లోక్‌నాథ్, పీహెచ్‌ఎన్ అరుణ కుమారి, హెల్త్ సూపర్ వైజర్లు సూర్యకళ, విశ్వనాథ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే బుక్కరాయ సముద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ తెహరున్నీసా, సీహెచ్‌ఓ మోహన్‌రావు, సూపర్ వైజర్ జానీరాజ్, హెల్త్ అసిస్టెంట్ ధనుంజయ, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ జయంతి, మహిళా ఆరోగ్య కార్యకర్త వరలక్ష్మి, పుష్పావతి, ప్రసన్న, లక్ష్మి, వాణి సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి సందర్శన

గుత్తి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని సోమవారం ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు రేవతి, రేణుక, నిర్మల తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. వైద్య సేవలపై ఆరా తీశారు.

సందడిగా వనభోజనాలు



యర్రగుంట్లలో రాముడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు



వన భోజనాలకు వెళ్లి తిరిగి గ్రామంలోకి వస్తున్న శివపురం గ్రామస్తులు

గార్లదిన్నె/శింగనమల: గార్లదిన్నె మండలంలోని యర్రగుంట్ల, తిమ్మంపేటలో సోమవారం ఆయా గ్రామస్తులు వనభోజన కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామనవమి పండుగ మరుసటి రోజు గ్రామాల్లో వనభోజనాలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆయా గ్రామాల్లో ప్రజలు ఉదయాన్నే నిద్రలేచి వంట సామగ్రి గంపలో వేసుకుని సమీపంలోని పొలాల్లోకి వెళ్లి, అక్కడే భోజనాలు చేసుకుని కుటుంబ సభ్యులంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. సాయంత్రం మళ్లీ గంప తలమీద పెట్టుకొని ఆయా గ్రామాల్లో రాముని చిత్ర పటాలతో ఊరేగింపుగా దేవాలయాల్లో, బొడ్రాయికి టెంకాయలు కొట్టి ఇళ్లకు చేరారు.ఇలా చేస్తే గ్రామంలోని ప్రజలు సుభిక్షంగా ఉండి, పంటలు సమృద్ధిగా పండుతాయని ప్రజలు అభిమతమన్నారు. అలాగే శింగనమల మండలంలోని శివపురం గ్రామంలో గ్రామస్తులు వనభోజనాలకు వెళ్లారు.